క్లుప్తంగా

ప్రతీ శుక్రవారం 'డ్రైడే' పాటించాలి



డ్రైడేలో భాగంగా సింగిరెడ్డివలస కాలువలోని మురుగునీరు పరిశీలిస్తున్న పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎంలు

తెర్లాం: మండలంలోని 33 గ్రామ పంచాయతీల్లో ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని ఎంపీడీఓ శంబంగి రామకృష్ణ, ఈఓపీఆర్‌డీ రాంబాబు సూచించారు. శుక్రవారం మండలంలోని పలు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్వహించి, వీధి కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టారు. అలాగే ప్రతీ ఇంటి వద్ద గోళాములు, కొబ్బరిబోండాలు, పాత్రల్లో నీరు నిల్వ ఉండకుండా చూశారు. పలు గ్రామాల్లో జరిగిన డ్రైడేను తనిఖీ చేసిన ఎంపీడీఓ, ఈఓపీఆర్‌డీ మాట్లాడుతూ డ్రైడే పాటించడం ద్వారా గ్రామాల్లో దోమలను నివారించవచ్చని, తద్వారా సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చేయొచ్చన్నారు.

లెస్సన్ ప్లాన్ తప్పనిసరి



పాఠశాల రికార్డులు పరిశీలిస్తున్న ఎంఈఓ త్రినాథరావు

తెర్లాం: ప్రతీ ఉపాధ్యాయుడు పాఠ్యప్రణాళిక(లెస్సన్ ప్లాన్), డైరీ తప్పనిసరిగా కలిగి ఉండాలని, లెస్సన్ ప్లాన్ ప్రకారం ప్రతిరోజూ విద్యాబోధన చేయాలని మండల విద్యాశాఖాధికారి జె.త్రినాధరావు సూచించారు. మండలంలోని మాధంబట్లవలస ప్రాథమిక పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆయన ఉపాధ్యాయుల లెస్సన్ ప్లాన్‌లు, డైరీలను తనిఖీ చేశారు. అలాగే పాఠశాలలో ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు, రికార్డులు, విద్యార్థుల వర్క్‌బుక్స్, మరుగుదొడ్ల నిర్వహణ, జగనన్న గోరుముద్ద పథకం అమలును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా విద్యార్థులకు విద్యాబోధన చేయాలని, ప్రతిరోజూ విద్యార్థులతో వర్క్‌బుక్స్ రాయించాలని, మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందేలా చూడాలని తెలిపారు. ఆయన వెంట ఉపాధ్యాయుడు ఎం.చంద్రరావు తదితరులు ఉన్నారు.

శతశాతం ఈ–క్రాప్ నమోదు చేయాలి



వీఏఏల శిక్షణలో మాట్లాడుతున్న ఏడీఏ చంద్రరావు

రాజాం సిటీ: గ్రామాల్లోని రైతుల పంటలకు సంబంధించి, ఈ–క్రాప్ నమోదు ప్రక్రియను శతశాతం చేపట్టాలని ఏడీఏ కె.చంద్రరావు సూచించారు. శుక్రవారం స్థానిక వ్యవసాయ శాఖ కార్యాలయంలో వీఏఏలకు ఇచ్చిన ఒక్కరోజు శిక్షణ కార్యక్రమానికి హాజరైన ఆయన యాప్ ద్వారా ఈ–క్రాప్ నమోదుతో పాటు పంటకోత ప్రయోగాలను పొందుపరిచే విధానాన్ని వివరించారు. నిర్దేశించిన లక్ష్యాలను చేరుకునేందుకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఓ ఎం.రేణుకాసాయి తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ సర్వేను వేగవంతం చేయాలి



పెంట గ్రామ సచివాలయంలో ఓటరు జాబితాను పరిశీలిస్తున్న తహసీల్దార్ రాజేశ్వరరావు

బొబ్బిలి: ఓటర్ సర్వేను వేగవంతం చేయాలని తహసీల్దార్ డోల రాజేశ్వరరావు సూచించారు. మండలంలోని పెంట గ్రామ సచివాలయాన్ని శుక్రవారం సందర్శించిన ఆయన అక్కడి బీఎల్‌వోలతో కాసేపు మాట్లాడారు. ఇక్కడి రెండు పోలింగ్‌స్టేషన్ల పరిధిలో ఎంతమంది ఓటర్లు ఉన్నారు.. వారి వివరాలు సరిగ్గా ఉన్నదీ లేనిదీ అడిగి తెలుసుకున్నారు. సర్వేలో ఓటరు ఇంటి నంబర్ తప్పనిసరిగా నమోదు చేయాలని తెలిపారు. సర్వేను వీలైనంత త్వరగా పూర్తిచేసి, నివేదికను అందజేయాలన్నారు.

నేడు న్యాయ అవగాహన సదస్సు

రాజాం సిటీ: స్థానిక ప్రభుత్వ బాలుర వసతి గృహంలో న్యాయ అవగాహన సదస్సు శనివారం నిర్వహిస్తున్నట్లు సీనియర్ సివిల్ జడ్జి ఎం.బాబు ఓ ప్రకటనలో శుక్రవారం తెలిపారు. ఈ సదస్సులో విద్యాహక్కు చట్టం, బాలకార్మిక వ్యవస్థ తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నామన్నారు. విద్యార్థులు, యువత, ఔత్సాహికులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వైద్యరంగానికి ప్రభుత్వం ప్రాధాన్యం

- తారాపురం, గొల్లపేట వెల్‌నెస్ సెంటర్ల ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే శంబంగి



గొల్లలపేట వెల్‌నెస్ సెంటర్ శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి

రామభద్రపురం: వైద్యరంగానికి ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. మండలంలోని గొల్లలపేట, తారాపురం గ్రామాల్లో చెరో రూ.21 లక్షల నిధులతో కొత్తగా నిర్మించిన వెల్‌నెస్ సెంటర్ల నూతన భవనాలను ఎమ్మెల్యే శుక్రవారం ప్రారంభించారు. అలాగే రామభద్రపురంలోని శివాలయం వద్ద రూ.7 లక్షల వ్యయంతో కల్వర్ట్, డ్రైనేజీ నిర్మాణ పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామీణులకు పూర్తిస్థాయిలో వైద్యసేవలందించాలన్న సదుద్దేశ్యంతో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతీ సచివాలయం పరిధిలో ఓ వెల్‌నెస్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. ప్రజలకు నిత్యం వైద్యసేవలు అందేలా ఎంఎల్‌హెచ్‌పీ స్థాయి వైద్యాధికారిని కూడా నియమించారన్నారు. వీరితో పాటు ఆ ప్రాంత ఏఎన్‌ఎం, ఆశవర్కర్ కూడా అందుబాటులో ఉంటారన్నారు. ఇదిలా ఉండగా, ఫ్యామిలీ డాక్టర్ విధానం ద్వారా గ్రామాల్లోని ప్రజలకు 104 వాహనం ద్వారా ఇంటి వద్దకే వైద్యసేవలు చేర్చిన ఘనత సీఎం జగనన్నకే దక్కుతుందన్నారు. వైద్యాధికారిణి ఏఎల్‌జి శిరీష మాట్లాడుతూ ప్రజారోగ్యానికి ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల ద్వారా చేపడుతున్న కార్యక్రమాలు ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతున్నాయన్నారు. ఆరోగ్యంతో పాటు వెల్‌నెస్ కార్యక్రమం ద్వారా హార్ట్ ఎటాక్, కేన్సర్, హైపర్ టెన్షన్ తదితర సమస్యలపై అవగాహన కల్పిస్తున్నామన్నారు. వెల్‌నెస్ సెంటర్లలో మొత్తం 64 రకాల మందులను ప్రభుత్వం అందుబాటులో ఉంచుతోందని, వీటిని అవసరమైన రోగులకు ఉచితంగా అందించడం జరుగుతోందన్నారు. గర్భిణులకు ఎప్పటికప్పుడు వైద్యపరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించడం జరుగుతోందన్నారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ అజెండా..

స్థానిక శివాలయం వద్ద పలు అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే శంబంగి మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ అజెండా అన్నారు. గ్రామాల్లోని ప్రజలకు అవసరమైన సచివాలయాలు, ఆర్‌బీకేలు, వెల్‌నెస్ సెంటర్లు, పాలకేంద్రాలు వంటి కార్యాలయాల నిర్మాణాలు, సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణాలు వంటి అభివృద్ధి పనులను ప్రభుత్వం చేపడుతుంటే టీడీపీ నాయకులకు మింగుడుపడడం లేదన్నారు. ప్రభుత్వాన్ని ఎలా పడగొట్టాలా అనే దురాలోచన తప్ప ప్రజలకు చేసే మంచి పనులను మెచ్చుకునే తత్వం ఆ పార్టీ నాయకులకు లేదని విమర్శించారు. రోజురోజుకూ ప్రజల్లో ప్రభుత్వానికి పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేకనే చంద్రబాబు అండ్ కో జగనన్న సర్కారుపై లేనిపోని ఆరోపణలు చేస్తున్నారని, వాటిని నమ్మవద్దన్నారు. వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ జగనన్న ప్రభుత్వమే అధికారంలోకి వస్తుందని జోష్యం చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ సీహెచ్ లక్ష్మణరావు, జెడ్పీటీసీ ఎ.సరస్వతి, బొబ్బిలి ఎంపీపీ ప్రతినిధి ఎస్.వేణుగోపాలనాయుడు, తారాపురం, గొల్లపేట సర్పంచ్‌లు బి.రవణమ్మ, కె.రమ్య, ఎంపీటీసీలు బి. సునీత, ఎస్.రవణమ్మ, పీఆర్ డీఈఈ అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే గ్రామస్వరాజ్యం



బాడంగి: మహిళలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

- 'గడప గడపకు మన ప్రభుత్వం'లో ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు

బాడంగి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తోనే మహాత్మాగాంధీ కలలుగన్న గ్రామస్వరాజ్యం సాధన సాధ్యమని ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు అన్నారు. శుక్రవారం మండలంలోని గూడెపువలస గ్రామంలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యేకు గ్రామస్తులు ఘనస్వాగతం పలికారు. అనంతరం ఇంటింటికీ వెళ్లిన ఆయన ప్రభుత్వ పాలన ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఈ క్రమంలో జగనన్న సర్కారు సంక్షేమ పాలనపై ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధి, ప్రజాసంక్షేమమే వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ధ్యేయమన్నారు. ఓ వైపు గ్రామసచివాలయ వ్యవస్థ ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు, మరోవైపు వలంటీర్ వ్యవస్థ ద్వారా పారదర్శకంగా ప్రభుత్వ పథకాలు అందిస్తున్న ఘనత సీఎం జగనన్నదేనన్నారు. గతంలో టీడీపీ హయాంలో ఏ ఒక్క పథకం కావాలన్నా అప్పటి జన్మభూమి కమిటీల ప్రమేయం లేనిదే వచ్చేది కాదన్నారు. ఇప్పుడు అలా కాదని, అర్హతే ప్రామాణికంగా కుల, మత, రాజకీయ పార్టీలకు అతీతంగా పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఇప్పటివరకు అమలైన ఏ ఒక్క పథకంలోనూ ఇంతవరకు అవినీతి జరిగిన దాఖలాలు లేవన్నారు. ఇదే ప్రభుత్వ పారదర్శక పాలనకు నిదర్శనమన్నారు. అన్ని వర్గాల ప్రజలు బాగుండాలన్నదే ప్రభుత్వ ఉద్దేశ్యమని, అందుకే ప్రతీ ఇంటికి మేలు జరిగేలా పథకాలు రూపొందించి, అమలు చేయడం జరుగుతోందన్నారు. ఇదే సంక్షేమ పాలన కొనసాగాలంటే వచ్చే ఎన్నికల్లోనూ మళ్లీ వైఎస్సార్ సీపీ ప్రభుత్వాన్నే గెలించాలని ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ బొబ్బిలి మండల అధ్యక్షుడు ఎస్.వేణుగోపాలనాయుడు, జెడ్పీటీసీ రామారావు, మండల జేసీఎస్ కన్వీనర్ ఎం.శంకరరావు ఎంపీటీసీ పి.సింహాచలం, సర్పంచ్ గణేశ్వరరాజు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

- బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి నరేంద్ర



రాజాం సిటీ: గుయ్యానవలసలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది

రాజాం సిటీ: గ్రామాల్లో నిర్వహిస్తున్న ఫ్యామిలీ ఫిజీషియన్ సేవలు సద్వినియోగం చేసుకోవాలని బొద్దాం పీహెచ్‌సీ వైద్యాధికారి నరేంద్ర కోరారు. శుక్రవారం మండలంలోని గుయ్యానవలసలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం నిర్వహించి, రోగులకు వైద్యసేవలు అందజేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఈ కార్యక్రమాన్ని నిరంతర ప్రక్రియలా చేపడుతున్నామన్నారు. రోగుల ఇంటి వద్దకే వెళ్లి, సేవలు అందిస్తుండడంతో ప్రజలు కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు.

తెర్లాం: మండలంలోని కవిరాయునివలస గ్రామంలో ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. తెర్లాం పీహెచ్‌సీకి చెందిన వైద్యులు గ్రామంలోని దీర్ఘకాలిక రోగులు, గర్భిణులు, అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యసేవలు అందించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేశారు. తెర్లాం పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న మన కుటుంబ వైద్యుడు(ఫ్యామిలీ ఫిజీషియన్) కార్యక్రమాన్ని గ్రామీణులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి హరి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

రేగిడి: మండలంలోని వెంకటాపురం, ఖండ్యాం గ్రామాల్లో శుక్రవారం వైద్యశిబిరం నిర్వహించి, పలువురికి వైద్యసేవలు అందించి, ఉచితంగా మందులు అందజేశారు. కార్యక్రమంలో వైద్యుడు అసిరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

మసీదు మరమ్మతులకు వక్ఫ్ బోర్డు నిధులు



ముస్లిం మతపెద్దలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే శంబంగి

బొబ్బిలి: స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో తెర్లాం మండలంలోని నందిగాంలోని మసీదు మరమ్మతులకు మంజూరైన వక్ఫ్ బోర్డు నిధులను ఎమ్మెల్యే శంబంగి వెంకట చినఅప్పలనాయుడు చేతులమీదుగా శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఎస్వీ మురళీకృష్ణారావు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ హమీద్, కౌన్సిలర్ పాలవలస ఉమాశంకర్ పాల్గొన్నారు.

నేడు బొద్దాంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'

రాజాం: మండలంలోని బొద్దాం గ్రామంలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ బాసూరి శంకరరావు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. సాయంత్రం 4 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కంబాల జోగులుతో పాటు ఎంపీ బెల్లాన చంద్రశేఖర్ పాల్గొంటారని, మండలంలోని అన్ని శాఖల అధికారులు, పార్టీ నేతలు, కార్యకర్తలు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ కేంద్రానికి ఎల్‌ఈడీ టీవీ అందజేత



టీవీని అందజేస్తున్న వెంకటరావుశర్మ

వంగర: మండలంలోని అరసాడ అంగన్‌వాడీ–1 కేంద్రానికి ఎల్‌ఈడీ టీవీని గ్రామానికి చెందిన ప్రధానార్చకులు కుంచనపల్లి వెంకటరావుశర్మ, వారి కుమారులు గణేష్ శర్మ, అప్పన్నశాస్త్రి శుక్రవారం అందజేశారు. జాతీయ విద్యావిధానానికి ఆకర్షితులై, చిన్నతనం నుంచి దృశ్య, శ్రవణ విద్యనందించాలనే లక్ష్యంతో రూ.20 వేల విలువైన టెలివిజన్‌ను సదరు దాతలు అందించినట్లు అంగన్‌వాడీ కార్యకర్త నెల్లి విజయలక్ష్మి పండిట్ తెలిపారు. కార్యక్రమంలో హెచ్‌ఎం కోరాడ భుజంగరావు, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

30న సామూహిక గృహప్రవేశాలు!



జగనన్న కాలనీ పరిశీలనలో హౌసింగ్ ప్రత్యేక కార్యదర్శి దివాన్

బొబ్బిలి: స్థానిక పట్టణంలోని ఐటీఐ కాలనీ వద్ద కొత్తగా నిర్మించిన జగనన్న కాలనీ ఇళ్లను హౌసింగ్ శాఖ ప్రత్యేక కార్యదర్శి దివాన్ శుక్రవారం పరిశీలించారు. ఈ నెల 30వ తేదీన సామూహిక గృహప్రవేశాలు పురస్కరించుకుని, ఆయన జగనన్న కాలనీ ఇళ్ల పరిశీలనకు వచ్చినట్లు సమాచారం. ఆయన మాట్లాడుతూ త్వరితగతిన ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యేలా లబ్ధిదారులను చైతన్యం చేయాలని సిబ్బందికి సూచించారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు, హౌసింగ్ డీఈఈ పి.అప్పయ్య తదితరులు ఉన్నారు.

సజావుగా ఎన్నికలు జరిగేలా చర్యలు



బాడంగి: మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రానికి బయలుదేరుతున్న సిబ్బంది

వంగర: పంచాయతీ ఉపఎన్నికలు సజావుగా జరిగేలా చర్యలు చేపడుతున్నట్లు ఎంపీడీవో వావిలపల్లి శ్రీనివాసరావు తెలిపారు. శుక్రవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ సిబ్బందికి ఎన్నికల పోలింగ్ మెటీరియల్‌ను అందజేసిన ఆయన పోలింగ్ సమయంలో ఎటువంటి వివాదాలకు పాల్పడవద్దని సిబ్బందికి సూచించారు. ప్రశాంత వాతావరణంలో పోలింగ్ పూర్తయ్యేలా చూడాలన్నారు.

నేడు పోలింగ్..

బాడంగి: మండలంలోని పాల్తేరు వార్డు మెంబరు ఉపఎన్నిక పోలింగ్‌కు ఏర్పాట్లు పూర్తయ్యాయి. శనివారం పోలింగ్ జరగనుండగా, శుక్రవారం సాయంత్రానికే పోలింగ్ సిబ్బంది భారీ బందోబస్తు నడుమ మెటీరియల్‌తో పోలింగ్ కేంద్రానికి చేరుకున్నారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పోలింగ్ జరుగుతుంది. అదేరోజు మధ్యాహ్నం ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి ఉంటుంది.

బొబ్బిలి: మండలంలోని కొండదేవుపల్లి పంచాయతీ రెండో వార్డు ఉప ఎన్నిక పురస్కరించుకుని, అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు అధికారులు తెలిపారు. శనివారం జరిగే పోలింగ్‌కు సీఐ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఎంపీడీఓ రవికుమార్, ఈఓపీఆర్‌డీ అల్లు భాస్కరరావు ఎన్నికల ఏర్పాట్లను శుక్రవారం పరిశీలించారు.

విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలి



విద్యార్థి విద్యాసామర్థ్యాలు పరిశీలిస్తున్న గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ పద్మజ

రేగిడి: విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహించి, వారి విద్యాసామర్థ్యాల మెరుగుకు కృషి చేయాలని గురుకుల పాఠశాలల జిల్లా కో–ఆర్డినేటర్ టి.పద్మజ ఆదేశించారు. మండలంలోని ఉంగరాడమెట్ట వద్ద ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాలను శుక్రవారం సందర్శించిన ఆమె విద్యార్థులకు అందిస్తున్న విద్యాబోధన, వారికి కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను పరిశీలించారు. పదో తరగతి విద్యార్థులతో కాసేపు మాట్లాడిన ఆమె ప్రభుత్వం అన్ని సదుపాయాలు కల్పిస్తోందని, బాగా చదువుకుని ఉన్నత స్థాయిలో స్థిరపడాలని ఆకాంక్షించారు. పక్కా ప్రణాళికతో చదివితే పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో మంచి మార్కులు తెచ్చుకోవచ్చని తెలిపారు. పాఠశాల పరిసరాల్లో మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణకు తోడ్పడాలని ప్రిన్సిపాల్ బి.బుచ్చిరాజుకు సూచించారు.

సన్మానం



బాడంగి: బదిలీ ఎంఈఓలను సన్మానిస్తున్న ఎంపీపీ గౌరి, జెడ్పీటీసీ రామారావు

రేగిడి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఉపాధి హామీ పథకం ఏపీవో ఎస్.హరనాథరావును శుక్రవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ఆయన ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ చేతులమీదుగా అవార్డు అందుకున్న నేపథ్యంలో ఆయనను సత్కరించినట్లు ఎంపీడీఓ నాగమణి తెలిపారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ హేమసుందరరావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సంతకవిటి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ ఎ.సులోచనారాణి, డిప్యూటీ తహసీల్దార్ రంజిత్‌ను శుక్రవారం సత్కరించారు.

బాడంగి: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఇటీవల బదిలీపై వేరే ప్రాంతానికి వెళ్లిన ఎంఈవోలు ఎ.తిరుమలప్రసాద్, జి.కృష్ణమూర్తిని శుక్రవారం సత్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమానికి హాజరైన ఎంపీపీ భోగి గౌరి, జెడ్పీటీసీ పెద్దింటి రామారావు వారి సేవలను కొనియాడారు.

జోరుగా ఉభాలు



ఎం.ఆర్ అగ్రహారం వద్ద నారు తీస్తున్న మహిళా కూలీలు



ఎం.ఆర్ అగ్రహారం వద్ద నొల్ల పడుతున్న రైతు



బొద్దూరులో ఉభాలు వేస్తున్న మహిళలు

సంతకవిటి: మండలంలోని ఎం.ఆర్.అగ్రహారం, గోళ్లవలస, బొద్దూరు, పొనుగుటివలస, సంతకవిటి, మండాకురిటి గ్రామాల్లో జోరుగా ఉభాలు వేస్తున్నారు. ఉదయాన్నే పొలాలకు చేరుకుంటున్న మహిళా కూలీలు సరదాగా పాటలు పాడుతూ వరి ఉడుపులు(ఉభాలు) వేస్తున్నారు. మరికొన్నిచోట్ల దమ్ము పనులు, నారుతీత పనులు కొనసాగుతున్నాయి.

భక్తిశ్రద్ధలతో శ్రావణమాస పూజలు

బొబ్బిలి, రాజాం నియోజకవర్గాల్లోని అన్ని ప్రాంతాల్లో శ్రావణమాస పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. మహిళలంతా వేకువజామున తలస్నానం చేసి, ఆలయాలకు చేరుకుని, ప్రత్యేక పూజలు చేశారు. ఇళ్లల్లోనూ శ్రావణ లక్ష్మీవ్రతాలు ఆచరించి, దైవం పట్ల తమకున్న భక్తిని చాటుకున్నారు. శ్రావణమాసంలోని తొలి శుక్రవారం కావడంతో దేవాలయాలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. దీంతో అంతటా ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.

-సాక్షి నెట్‌వర్క్



రేగిడి: ఉంగరాడలో ఆలయంలో భక్తుల పూజలు



రామభద్రపురం దుర్గాదేవికి అభిషేకం చేస్తున్న దృశ్యం



రాజాం: నవదుర్గాదేవి ఆలయంలో భక్తుల రద్దీ



రాజాం సిటీ: గాయత్రిమాతకు పూజలు చేస్తున్న భక్తులు

చురుగ్గా పారిశుద్ధ్య పనులు

బాడంగి: స్థానిక సినిమా కాలనీ, ప్రధాన రోడ్డులో పారిశుద్ధ్య పనులు శుక్రవారం చురుగ్గా చేపట్టారు. రోడ్లపైన ఉన్న చెత్తాచెదారంతో పాటు కాలువల్లో పేరుకుపోయిన మురుగు, పూడికలు బయటకు తీసి, వాటిని ట్రాక్టర్లలోకి ఎక్కించి, డంపింగ్ యార్డుకు తరలించారు. వర్షాకాలంలో దోమల ద్వారా ఎక్కువగా మలేరియా, డెంగీ, చికెన్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున అవి ప్రబలకుండా చర్యలు చేపడుతున్నట్లు సర్పంచ్ కండి రమేష్ తెలిపారు.

బంతి, కంది విత్తనాల పంపిణీ

రేగిడి: మండలంలోని దేవుదళ గ్రామ రైతు భరోసా కేంద్రంలో ఎస్సీ రైతులకు బంతి, కంది పంటల విత్తనాలు శుక్రవారం పంపిణీ చేశారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న వారు పొలంగట్లపై వేసి, అదనపు ఆదాయం సంపాదించుకోవచ్చని సర్పంచ్ కుప్పిలి గవరయ్య తెలిపారు. కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయం మాస్టర్ ట్రైనీ కిరణ్‌కుమార్, వీఏఏ ప్రవీణ పాల్గొన్నారు.